ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
7**
ఆదివారం 12 మే 2024

కేసీఆర్‌కు ఉన్నంత అహంకారం అర్వింద్‌కు ఉంది

నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

కోరుట్ల, మే 11 : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కల్వ కంట్ల చంద్రశేఖరావుకు ఉన్నంత అహంకారం అర్వింద్‌కు ఉందని, గత అసెంబ్లీ ఎన్నికలో బీజేపీ బీఆర్ఎస్‌కు మద్దతు పలుకగా ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలో బీఆర్ఎస్ బీజేపీ మద్దుతు పలుకుతుందని నిజామాబాదు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం పట్టణంలోని జువ్వాడి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుతో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఎన్నో కుట్రలు చేస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్ వ్యతిరేక ఓట్లు చీల్చడానికే అసెంబ్లీ ఎన్నికలో అర్వింద్ ఎమ్మెల్యేగా పోటీ చేసాడని అన్నారు. ఎంపీగా అర్వింద్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. చక్కర కర్మాగారలు, పసుపు బోర్డు ఏర్పాటుపై బీజేపీ చేతులు ఎత్తేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ విజయ డంకా మొగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంతం రాజం, సత్యనారాయణ గౌడ్, మ్యాకల నర్సయ్య, రంజిత్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్: నిజామాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి జీవన్‌రెడ్డిని ఆశీర్వదించాలని మున్సిపల్ ఛైర్ పర్సన్ అడువాల జ్యోతి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. జీవన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ వ్యాపార, వాణిజ్య సముదాయాలతో పాలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

మెట్‌పల్లి : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని గెలిపించాలని మెట్‌పల్లిలో పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, సీనియర్ నాయకుడు షాకీర్ ఆధ్వర్యంలో నాయకులు ప్రచారం చేపట్టారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో వారు పర్యటించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు గ్యారెంటీలను అమలు చేయడంతో పాటు అన్ని వర్గాల కోసం సంక్షేమ పథకానలు ప్రవేశపెట్టనున్నట్లు ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 13న జరగనున్న లక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్ధతుగా నిలబడి చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెట్టి లక్ష్మణ్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, షేక్ మమ్మద్, సంపత్, వెంకటేశ్వర్లు, పిట్ల లక్ష్మి, స్వప్న, పోశాని, లక్ష్మి పాల్గొన్నారు.

కోరుట్ల : జీవన్‌రెడ్డికి మద్దతుగా పట్టణంలో శనివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు ఆద్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని రైల్వే, కాలేజీ గ్రౌండ్ వద్ద వాకర్ అసోసియేషన్ సభ్యులను కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఐబీ రోడ్డులోని వ్యాపార వాణిజ్య సంస్థలలో ప్రచారం నిర్వహించారు. హోటలలో అటుకులు, టీలను పోస్తూ నేను మీ పనిలో మద్దతు పలుకుతున్నాని మీరు ఎన్నికలో జీవన్ రెడ్డికి మద్దతు పలికి చేతి గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మెన్ గడ్డమీది పవన్ కౌన్సిపల్ అన్వర్, కాంగ్రెస్ నాయకులు ఆడెపు మధు, పుప్పాల నాగరాజు, చౌలమద్ది శ్రీనివాస్‌లతో పాటు పలువురు కలిసారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం

ధర్మపురి, మే 11: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సహాయ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కౌంటర్ల ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఎన్నికల కోసం నియోజకవర్గ పరిధిలోని మండలాలతో పాటు జూలపల్లి మండలంలోని అబ్బాపూర్ గ్రామంలో 269 పోలింగ్ కేంద్రాల్లో పీవోలు, ఏపీవోలు, ఓపీవోలకు విధులు అప్పగించినట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనంగా సెక్టోరల్ అబ్జర్వర్‌ను నియమించామన్నారు.

విత్తనాలు, ఎరువుల విక్రయాల్లో అక్రమాలు జరిగితే చర్యలు

కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా



కలెక్టర్‌ను సత్కరిస్తున్న విత్తన డీలర్లు, ఉద్యోగులు

జగిత్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రానున్న వానాకాలం సీజన్‌లో విత్తనాలు, ఎరువుల విక్రయాల్లో ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు, ఏజన్సీలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శనివారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విత్తనాలు, ఎరువుల డీలర్ల అవగాహన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను సమయానికి అందుబాటులో ఉంచి అమ్మకాలను నిబంధనల మేరకు జరపాలని ఆదేశంచారు. ఆధికృత లైసెన్స్‌లు లేకుండా డీలర్లు వ్యాపారం కొనసాగించరాదన్నారు. సమయానికి ముందే రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఈ పాస్ విధానం ద్వారానే అమ్మకాలు సాగించాలన్నారు. ఆన్‌లైన్, ఫిజికల్ స్టాక్‌లలో వ్యత్యాసం లేకుండా చూడాలన్నారు. ఎరువులు, క్రిమి సంహారక మందుల నిల్వలను స్టాక్ బోర్డులు విడి విడిగా ఏర్పాటు చేసి నమోదు చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని, స్టాక్ బోర్డు ఏ రోజు కారోజు అప్‌డేట్ చేయాలన్నారు.

అనంతరం కలెక్టర్‌ను పలువురు విత్తన డీలర్లు మర్యాదపూర్వంగా శాలువతో సత్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా వ్యవసాయ అధికారిణి వాణి, ఏడీ కల్పన, మార్క్ ఫెడ్ అధికారిణి, డీలర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలి

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సంజయ్ కుమార్, రమణ



రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పాల్గొన్న ఎమ్మెల్సీ

జగిత్యాల టౌన్, మే 11 : జిల్లాలు రద్దు చేస్తామని అంటున్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఈ ఎంపీ ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ రమణ, జడ్పీ ఛైర్ పర్సన్ దావ వసంత, మాజీ మంత్రి రాజేశంగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా పట్టణం లోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలో హంగ్ రాబోతుందని ఇందులో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ రోడ్ షోలో పట్టణ అధ్యక్షుడు గట్టు సతీష్, వైస్ ఛైర్మన్ గోళి శ్రీనివాస్ ఉన్నారు.

మెట్‌పల్లి : కాంగ్రెస్ వందరోజుల్లో అన్ని చేస్తామని 420 హామీలతో మోసం చేసి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణాన్ని పట్టించుకోని నాయకులు కుట్రలను తిప్పికొట్టి ప్రజా సమస్యలపై పోరాటం చేసే నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు వస్తేనే కాంగ్రెస్ నాయకులకు పథకాలు గుర్తుకొస్తాయని, ఎన్నికల తర్వాత వాటి అమలును దాటవేస్తారన్నారు. ఐదేళ్ల ఎంపీగా ఉన్న అర్వింద్ అభివృద్ధిని పట్టించుకోని నాయకులకు ఓటు వేస్తే ఆగమైపోతామన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరుపున నిలబడ్డ బాజిరెడ్డి గోవర్ధన్‌కు అవకాశమివ్వాలని కోరారు.

మెట్‌పల్లి రూరల్: సాధ్యం కానీ హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో ప్రాంత అభివృద్ధి కోసం పోరాటం చేయడానికి నిజామాబాద్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ ప్రధాన కార్యదర్శి గడ్డం రాజారెడ్డి ప్రజలను కోరారు. శనివారం మండలంలోని కొండ్రికర్ల గ్రామంలో ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ హాయంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరి స్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమం లో పార్టీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు మెండే రమేష్, రత్నా కర్, నాయ కులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాహనం తనిఖీ

జగిత్యాలరూరల్, మే 11 :జగిత్యాల రూరల్ మండలం పొలాస వద్ద జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ వాహనాన్ని ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. సారంగాపూర్ మండలం అర్పపల్లి గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం ముగించుకొని జగిత్యాల వైపు వస్తుండగా ఎన్నికల నియామవళి ప్రకారం ఎమ్మెల్యే వాహనాన్ని అధికారులు తనిఖీ చేయగా తనిఖీలకు ఎమ్మెల్యే పూర్తిగా సహకరించారు.

బీజేపీ, కాంగ్రెస్ మాటలు నమ్మిమోసపోవద్దు

జగిత్యాలరూరల్, మే11 : కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని జడ్పీఛైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్‌కు మద్దతుగా జగిత్యాల మండలం తిప్పన్నపేట, రూరల్ మండలం చల్‌గల్ గ్రామాల్లో జడ్పీ ఛైర్‌పర్సన్ దావ వసంతసురేష్, మార్క్‌ఫెడ్ మాజీ ఛైర్మన్ లోక బాపురెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ కార్యక్రమంలో అర్బన్ ఎంపీపీ ములా సపులక్ష్మీ, మాజీ ఉపసర్పంచ్ నలువాలపద్మతి రుపతి, గ్రామ శాఖఅధ్యక్షుడు పూదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, మే 11: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనం తరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఎండ తీవ్ర తతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. వందలాదిగా భక్తులు స్వామి వారి సన్నిధిలో హనుమాన్ దీక్ష తీసుకున్నారు. భక్తులకు కావల్సిన ఏర్పాట్లను ఈవో చంద్రశేఖర్‌తో పాటు అధికారులు పర్యవేక్షించారు.

ముగిసిన ఎప్‌సెట్

తిమ్మాపూర్, మే11: ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన టీఎస్ ఎప్‌సెట్ పరీక్షలు శనివారం జిల్లాలో సజావుగా ముగిసాయి. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం ఈ పరీక్ష కేవలం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఒకే సెషన్‌లో జరిగాయి. పరీక్ష సమయానికి గంటన్నర ముందు నుండే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోని అనుమతించారు. 9 పరీక్ష కేంద్రాలలో కలిపి 2709 మందికి 2674 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తంగా 98.7శాతం హాజరు నమోదైందని అధికారులు తెలిపారు.



తిమ్మాపూర్‌లో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

మోడల్ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించిన డీఆర్డీవో

మానకొండూర్, మే 11 : మండలంలోని లలితాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్‌ను శనివారం కరీంనగర్ డిఆర్డీవో శ్రీధర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం గంగిపల్లి, దేవంపల్లి గ్రామాలలోని అమ్మ ఆదర్శ పాఠశాలల పనిని వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గంగిపల్లిలో జరుగుతున్న ఉపాధీ హామీ పనులను పరిశీలించి కూలి చెల్లింపులపై స్వయంగా కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో ఎం. నర్సయ్య, అధికారులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికలపై గల్ఫ్‌లో ఆసక్తి

● ఎన్ఆర్ఐలు, ప్రవాస కార్మికుల్లో సర్వత్రా చర్చ



సిరిసిల్ల క్రైం, మే 11: పార్లమెంట్ ఎన్నికలపై గల్ఫ్‌లో ఆసక్తి నెలకొంది. ప్రధానంగా గల్ఫ్ దేశాల్లో ఉపాధికోసం వెళ్లిన ప్రవాసకార్మికులు, ఎన్ఆర్ఐల్లోనూ సర్వత్రా చర్చనీయాంశమైంది. పార్లమెంటు ఎన్నికలపై ప్రవాస కార్మికులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌పై అందరి దృష్టి నెలకొంది. గల్ఫ్ సమస్యలపై కేంద్రప్రభుత్వమే పరిష్కరించే అవకాశం ఉన్నందున ఏ ప్రాంతంలో ఎవరెవరూ బరిలో నిలిచి ప్రచార సరళిపై ప్రవాస కార్మికులు ప్రత్యేక దృష్టిపెట్టారు. దుబాయ్, సౌదీ క్యాంపులలో కొందరు ఎన్ఆర్ఐ సెల్ ప్రతినిధులు అనుకూలమైన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు.

గల్ఫ్‌లో 50వేల మంది ప్రవాస కార్మికులు

గల్ఫ్‌లో దాదాపు 50వేలమందికి పైగా ప్రవాస కార్మికులు ఉపాధి పొందుతున్నారు. లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఎవరేంటనేది అంచనా వేస్తున్నారు. కరీంనగర్, నిజామాబాద్ లోకసభ నియోజకవర్గం పరిధిలోని కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్, నిజామాబాద్ నియోజకవర్గాలకు చెందిన వేలాదిమంది కార్మికులు దుబాయ్, సౌదీ, మస్కట్, కువైట్, బెహరైన్, ఇరాక్, తదితర దేశాల్లో పనిచేస్తున్నారు.

ఎవరెవరు ఏ విధమైన హామీలు ఇచ్చారనేది ప్రవాస కార్మికులు గమనిస్తున్నారు. గల్ఫ్‌లో ఉపాధి పొందుతున్న ప్రవాసకార్మికులు ఎన్ఆర్ఐ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించేవారికే మద్ధతు పలుకడానికి ప్రవాసకార్మికులు సిద్ధమయ్యారు. ఓటు హక్కు వినియోగిం చుకునేందుకు ఇప్పటికే వందలాది మంది ప్రవాస కార్మికులు సెలవుపై వచ్చారు.

విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ల ఆసక్తి

విదేశాల్లో ఉద్యోగం చేసే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు, ఉన్నత చదువులు చదివే విద్యార్థుల్లోనూ ఈనెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికలపై ఆసక్తి నెలకొంది. కరీంనగర్, నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో అనేకమంది అమెరికా, అస్ట్రేలియా, లండన్, కెనడా తదితర దేశాల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు. ఉద్యోగం చేసేవారు కాకుండా ఉన్నత చదువులు చదువుతున్నారు. పోటీ ఎలా ఉందనేది స్వగ్రామాల్లో తెలుసుకుంటున్నారు.

హ్యాండ్‌బాల్ వేసవి శిక్షణ శిబిరానికి స్పందన

వెల్గటూర్, మే 11: చెగ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన హాండ్ బాల్ వేసవి శిక్షణ శిభిరానికి విశేష స్పందన లభించినట్లు పీఈటీ అశోక్ తెలిపారు. ఈ నెల 1 నుండి 31 వరకు వేసవి శిక్షణ శిభిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామం లోని యువకులకు క్రీడల పట్ల అవగాహన కల్పించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. చెడు వ్యసనాల నుండి, మొబైల్ ఫోన్ల నుండి దూరం చేసేలా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించకుంటే చర్యలు



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

తంగళ్లపల్లి, మే 11: ఎన్నికల నియమావళిని పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంతో పాటు నేరెళ్ల, జిల్లెల గ్రామాల్లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి, సిరిసిల్ల రూరల్ సీఐ సదన్ కుమార్, ఎస్ఐ సుధాకర్‌ల ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన జరుగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భయాందోళనలకు తావు లేకుండా చేసేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు.

ఇల్లంతకుంట: లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఇల్లంతకుంట, జవారిపేటలో కేంద్ర పోలీసు బలగాలు శనివారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. గ్రామాలలో ఉద్రిక్త వాతావరణం కలిగించాలని చూసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దన్నారు. ఎస్సై రాజుగౌడ్ ఉన్నారు.

చందుర్తి: శాంతి భద్రతల పరిరక్షణ కోసమే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి పేర్కొన్నారు. చందుర్తి మండల కేంద్రంలో కేంద్ర సాయుధ బలగాలతో ప్రధాన వీధుల్లో శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

రుద్రంగి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించేందుకు రుద్రంగి మండల కేంద్రంలో శనివారం కేంద్ర పోలీస్ బలగాలు కవాతు నిర్వహించారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అశోక్ పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



కరీంనగర్‌లో తనిఖీలను పర్యవేక్షిస్తున్న సీపీ

కరీంనగర్ క్రైం, మే 11 : పోలీస్‌కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసులు శనివారం రాత్రి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కరీంనగర్ పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి స్వయంగా తనిఖీలను పర్యవేక్షించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసి పోలింగ్‌కు కొన్ని గంటల సమయమే ఉండగా ఎన్నికల కోడ్ అమలులో భాగంగా పోలీసులు ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తున్నారు.

వికలాంగుడి అనుమానాస్పద మృతి

మల్లాపూర్, మే, 11: మండల కేంద్రానికి చెందిన అరికొప్పుల రాజేందర్(33) అనే వికలాంగుడు అనుమానస్పదంగా మృతి చెందినట్లు శనివారం కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన అరికొప్పుల రాజేందర్ కాలకృత్యాలు తీర్చుకోవడానికి తన మూడు చక్రాల బండిపై గ్రామ శివారులోని కాలువ వద్దకు వెళుతూ ఉండేవాడు. శనివారం కాలువ వద్ద రాజేందర్ రక్తం కారుతూ కింద పడి ఉండడాన్ని స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలం చేరుకొని రాజేందర్‌ను పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజేందర్ మృతదేహం వద్ద అతను ఉపయోగించే మూడు చక్రాల బండి పడి ఉండడంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పార్వతీ కోటేశ్వర స్వామి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

వెల్గటూర్, మే 11: కోటిలింగాల శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని మామిడి తోణాలతో అందంగా అలంకరించారు. కల్యాణ మంటపాన్ని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. ప్రతీ సంవత్సరం శంకర జయంతి సందర్భంగా స్వామి వారల కల్యాణం జరపడం ఆనవాయితీగా వస్తోంది. వైశాఖ శుద్ధ పంచమి ఆరుద్ర నక్షత్ర యుక్త అభిజిత్ లగ్న పుష్కరాంశ సుమూహూర్తాన స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించడానికి, కల్యాణం వీక్షించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం స్వామి వారికి అఖండ దీపారాధన, అంకురార్పణ, ధ్వజారోహణ, నవగ్రహారాధన, గణపతి పూజ, పుణ్యాహవచనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు నాగరాజుశర్మ, సంజీవ్‌శర్మలు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారి కృపాకటాక్షాలు పొందాలని అర్చకులు, ఈవో కాంతారెడ్డి కోరారు.

ఘనంగా రామానుజుల జయంతి



స్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపు

ఇల్లందకుంట, మే 11: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో భగవత్ రామానుజుల వారి 1007 జయంతి ఉత్సవాలు శనివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఈ నెల 12న రామానుజుల జయంతిని పురస్కరించుకొని స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల గుండా భక్తుల హర్ష ధ్వానాల నడుమ పల్లెకిలో ఊరేగించారు. ఈ ఉత్సవాలు ఆలయంలో రెండ్రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యానిర్వాహణాధికారి కందుల సుధాకర్, ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యులు తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మే 11(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లను వివరించారు. పోలింగ్ స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో జరిగేలా సర్వం సిద్ధం చేశారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,194 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని, వీటిలో 288 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. 17 లక్షల 97వేల మంది ఓటర్లు ఉన్నారని, ఓటర్లలో పురుషులకంటే 40వేల మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని అన్నారు. 42వేల మంది దివ్యాంగులు, 13,200 మంది వయోవృద్ధులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. 8,815 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారని తెలిపారు. ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్ కింద నమోదు చేసుకున్న 6,800 మంది ఉద్యోగులు పోలింగ్ రోజున ఓటు హక్కును వినియోగించుకుంటారని కలెక్టర్ తెలిపారు. 28 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, నోటాతో కలుపుకొని ఒకటి ఎక్స్‌ట్రా ఉండడంతో ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి

రెండు బ్యాలెట్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఎక్కడ ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరుకుండా 21 ఎఫ్ఎస్‌టి టీం, 14 ఎస్ఎస్‌టీ టీంలను ఏర్పాటు చేశామని అన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా 200 ఫిర్యాదులు రాగా వాటిలో 144 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. 215 రూట్లలో 216 మంది సెక్టార్ ఆఫీసర్లను నియమించామని, ఈవీఎంలను తీసుకెళ్లే వాహనాలకు జీపీఎస్ అనుసంధానం చేశామని అన్నారు. స్థానికేతరులు శనివారం సాయంత్రం 6 తర్వాత వెళ్లి పోవాలని ఆదేశించారు.

రూ. 9.98 లక్షల నగదు పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 11: కరీంనగర్‌లోని టవర్‌సర్కిల్ వద్ద శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో 9 లక్షల 98 వేల రూపాయలు నగదు పట్టుబడిందని ఒకటో టౌన్ సీఐ సరిలాల్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా వాహనాల తనిఖీ చేస్తుండగా పాతబజారు శివాలయం వీధికి చెందిన వట్టిమల్ల రవీందర్ వద్ద 9.98 లక్షల నగదు పట్టుబడగా ఈ నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు చూపెట్టనందున సీజ్ చేశామని సీఐ తెలిపారు. పట్టుబడిన నగదును సంబంధిత ఎన్నికల అధికారికి స్వాధీనం చేశామని తెలిపారు.

మద్యం షాపులు మూసివేత

కరీంనగర్ క్రైం, మే 11: 13న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగిసింది. అలాగే మద్యం షాపుల కూడా మూసివేశారు. వైన్‌షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌లతో పాటు కల్లు షాపులు, మద్యం డిపో, కల్లు డిపోలను కమిషనరేట్ వ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు మూసివేయించారు. పోలింగ్ పూర్తి అయిన తరువాత సోమవారం సాయంత్రం 6 గంటల అనంతరం షాపులను తెరిచేందుకు అనుమతిస్తారు.



వైన్‌షాపునకు సీల్ వేస్తున్న పోలీసు

మద్యం పట్టివేత

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌లో మూడో టౌన్ పోలీసులు శనివారం నిర్వహించిన తనిఖీల్లో రెండు చోట్ల 52,200 రూపాయల మద్యం పట్టుబడింది. మానకొండూర్‌కు చెందిన పుట్ట మహేందర్ వద్ద 46,800 రూపాయల 28.2 లీటర్ల మద్యం పట్టుబడింది. కిసాన్‌నగర్‌కు చెందిన గొట్టిముక్కుల సాయికాంత్, విజయ్‌కుమార్‌ల వద్ద 5,400 రూపాయల విలువైన బీర్లు పట్టుబడ్డాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

● సీపీ అభిషేక్ మొహంతి
● పోలీసు అధికారులతో సమీక్ష

కరీంనగర్ క్రైం, మే 11: పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా 2,500 పోలీస్ ఫోర్స్‌ను వినియోగించనున్నామని సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్‌హాలులో ఎన్నికలకు కేటాయించిన పోలీస్, కేంద్ర బలగాల అధికారులుతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13న నిర్వహించ బోయే లోకసభ ఎన్నికలకు పూర్తి స్థాయిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా సిబ్బంది కేటాయించామన్నారు. అన్ని పోలింగ్ లోకేషన్లకు రూట్ ఆఫీసర్స్‌తో పాటు స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లను కేటాయించామన్నారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాల్లో స్థానిక పోలీసులతో పాటు, కేంద్ర పారా మిలిటరీ బలగాలను కేటాయించామని తెలిపారు. సిబ్బంది ఆదివారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రిని, ఈవీఎంలను స్వీకరించిన తరువాత వాటికి భద్రతగా వారితో పాటు, కేటాయించి పోలింగ్ లోకేషన్ , కేంద్రాన్ని తెలుసుకుని వారి వెంటే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నప్పటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాన్ని విడిచి వెళ్లవద్దని సూచించారు. పోలింగ్ రోజున ఉదయం 6 గంటలకే విధుల్లో చేరాలన్నారు. పోలింగ్ రోజున ఓటర్లను క్యూ పద్దతిలో ఉండేలా చూసుకోవాలన్నారు. ఓటు వేసేందుకు వచ్చే మహిళలు, వృద్ధులతో పాటు అన్ని వర్గాల ప్రజలతో సత్ప్రవర్తనతో మెదలాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే వాటిని నివారించేందుకు రూట్ ఆఫీసర్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులను కేటాయించా మన్నారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేనిదే పోలింగ్ కేంద్రంలోకి వెళ్ల వద్దని, వారు పిలిస్తేనే వెళ్లాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి

కరీంనగర్ క్రైం : పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికలకు కేటాయించబడిన స్పెషల్ యాక్షన్ టీమ్ అధికారులతో శనివారం సీపీ అభిషేక్ మొహంతి సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలను క్లస్టర్‌లుగా విభజించుకుని ప్రతీ క్లస్టర్‌కు స్పెషల్ యాక్షన్ టీంలను కేటాయించామన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే టీమ్స్ స్పందించి వీలైనంత త్వరగా సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా చర్యలు చేపట్టాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ శిక్షణ శిబిరాలు

● కరీంనగర్‌లో హెచ్‌సీఏ తరపున స్టేడియం ఏర్పాటుకు కృషి ● హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 11: క్రికెట్‌ను అన్ని జిల్లాల్లో అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు న్నారు. కరీంనగర్‌లో క్రికెట్‌కు మంచి ఆదరణ ఉందని, హెచ్‌సీఏ తరఫున క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేసేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. హెచ్‌సీఏ, కేడీసీఏ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరుగుతున్న క్రికెట్ శిక్షణ శిబిరాలను శనివారం అపెక్స్ కమిటీ సందర్శించింది. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ మొత్తం 29 క్రికెట్ శిక్షణ కేంద్రాల్లో 3 వేల మంది చిన్నారులు శిక్షణ పొందుతున్నారన్నారు. వచ్చే సంవత్సరం రాష్ట్రంలో శిక్షణ శిబిరాల సంఖ్యను రెండింతలు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే సంవత్సరం నాటికి కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి కనీసం ఐదుగురు క్రీడాకారులు ఐపీఎల్ స్థాయికి ఎదగాలని సూచించారు. కరీంనగర్ జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు వి.ఆగంరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు కేంద్రాల్లో శిక్షణ శిబిరం నడుస్తోందని, సుమారు 450 మందికి పైగా క్రీడాకారులు శిక్షణలో పాల్గొంటున్నారన్నారు. కరీంనగర్ లో టర్ఫ్ క్రికెట్ మైదానాన్ని ఏర్పాటు చేయాలని హెచ్‌సీఏను కోరారు. ఈ సందర్భంగా హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు కాసేపు బ్యాటింగ్ చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు దల్జిత్ సింగ్, కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి శ్రీనివాస్ రావు, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎస్ మురళీధర్ రావు, ఉపాధ్యాక్షులు మనోహర్ రావు, కోచ్‌లు డి శ్రీనివాస్, కిరణ్, సుదేష్, అజిత్, ప్రసాద్, శ్రావణ్, పూర్ణచందర్, శ్రీనాథ్ లతో పాటు క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అపెక్స్ కమిటీ సభ్యులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.



మాట్లాడుతున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు



గోదావరిలో యువకుడి గల్లంతు

ధర్మపురి, మే 11: ధర్మపురి వద్ద గోదావరిలో శనివారం ఒక యువకుడు గల్లంతయ్యాడు. గోదావరిలో స్నానం చేసేందుకు దిగిన 35 ఏళ్ల యువకుడు ఈత రాక పోవడం వల్ల నీటిలో మునిగి గల్లంతు అయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గల్లంతయిన యువకుడి కోసం జాలర్ల సాయంతో వెతుకుతున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

● టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్


మాట్లాడుతున్న టీఎన్‌జీవో నాయకులు

సుభాష్‌నగర్, మే11: ఓటు హక్కును వినియోగించుకుందాం..దేశ భవిష్యత్తును కాపాడుకుందామని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఎన్‌జీవో భవన్‌లో ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవో నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరుదే కీలక పాత్ర అని అన్నారు. ప్రలోభాలకు గురి కాకుండా తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ స్టేషన్‌లో విధులు నిర్వహించే ఉద్యోగులు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మీనారాయణ, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, మే 11: ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలో ఈ నెల 9న చేపల వేటకు వెళ్లి అదే గ్రామానికి చెందిన ముత్యాల బాలకృష్ణ విద్యుదాఘాతంతో మృతి చెందడానికి కారణం గ్రామంలోని బొమ్మడి శంకర్, పూటకుల్ల సుధీర్ అని వీరిని రిమాండ్‌కు తరలించామని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ శనివారం తెలిపారు. మండలంలోని సింగారం గ్రామంలో ఈ నెల 9న బాలకృష్ణను శంకర్, సుధీర్ గ్రామ శివారులోని మానేరు వాగులో కరెంటు షాక్‌తో చేపలు పట్టేందుకు తీసుకెళ్లారు. చేపలు పడుతున్న క్రమంలో బాలకృష్ణ చేపలకు అమర్చిన తీగకు విద్యుత్ సరఫరా కావడంతో చనిపోయాడు. అతడి మృతికి కారణమైన శంకర్, సుధీర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చారు. న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ముస్తాబాద్, మే 11: ముస్తాబాద్ పట్టణ కేంద్రం నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మాచారెడ్డి మండలం సోమార్‌పేటకు చెందిన కట్కూరి కుమారస్వామి, మాచారెడ్డికి చెందిన వంగ వినయ్ కుమార్ ద్విచక్రవాహనంపై 20 గ్రాముల గంజాయిని తరలిస్తుండగా మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలో పట్టుకున్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనం, గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

కోనరావుపేట,మే11: కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన వంగల మణమ్మ (70)అనే వృద్ధురాలు ఇంట్లో చీరతో దూలానికి ఉరివేసుకుని శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపి న వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మణెమ్మ కుమారుడు వంగల వెంకటేష్ తల్లి బాగోగులు చూడకపోవడంతో ఒంటరిగా ఉంటోంది. అంతేకా కుండా ఆరోగ్యం కూడా సహకరించకపోవడంతో మనస్థాపానికి గురైన మణెమ్మ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు సంఘటన గల కారణాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ విషయమై కూతురు ససుగుల భూలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

పశుగ్రాసానికి నిప్పుపెట్టిన మహిళపై కేసు

చందుర్తి, మే 11: పశుగ్రాసానికి నిప్పుపెట్టిన ఓ మహిళపై కేసు నమోదైనట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం చందుర్తి మండల కేంద్రంలోని కోన మల్లయ్య అనే రైతుకు చెందిన గడ్డివాముకు రామన్నపేట గ్రామం చెందిన పోతరాజు చిన్న భూమ్మక్క అనే మహిళ నిప్పు పెట్టింది. మల్లయ్య ఫిర్యాదు మేరకు భూమక్కపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల సస్పెన్షన్

గంగాధర, మే 11: గంగాధర సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు విద్యుత్ ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ఎస్ఈ గంగాధర్ ఉత్తర్వులు జారీ చేవారు. గంగాధర పంచాయతీ ఎలక్ట్రీషియన్ మూడురోజుల క్రితం విద్యుత్ షాక్‌కు గురైయ్యాడు. గంగాధర లైన్‌మన్ శ్రీనివాస్, ఆపరేటర్ అంతులాల్‌లు ప్రమాదానికి కారణమంటూ ఆరోపణలు వచ్చాయి. దీంతో ఇద్దరిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఎస్ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళ ఆకస్మిక మృతి

శంకరపట్నం, మే 11: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో ఓ మహిళ ఎండ తీవ్రతతో ఆకస్మికంగా మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం గొడిశాల గ్రామానికి చెందిన గొల్లపల్లి శోభ (32) వారం రోజుల క్రితం తల్లిగారి ఊరు తాడికల్‌కు వచ్చింది. శనివారం అన్నం తింటుండగా ఉన్నట్లు ఉండి ఒక్కసారి కుప్పకూలి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్ల ఉన్నట్లు తెలిపారు.

అభ్యర్థుల్లో గుబులు

● మూడు రోజుల పాటు వరుస సెలవులు
● విహార యాత్రలకు సిద్ధమవుతున్న జనం
● పోలింగ్ శాతం తగ్గుతుందేమోనని అనుమానం

జగిత్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వరుస సెలవులు వస్తుండటంతో అభ్యర్థుల్లో గుబులు రేగుతోంది. ఈ నెల 11,12,13 వరకు వరుస సెలవులు ఉండటంతో కొందరు ప్రజలు విహార యాత్రలకు సిద్ధమవుతున్నారు. దీంతో పోలింగ్ శాతం తగ్గుతుందేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 13న పోలింగ్ ఉండగా, ప్రభుత్వం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు సెలవు ప్రకటించింది. దీనికి తోడు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసిన కేంద్రాలకు సైతం ముందస్తుగా సెలవును ప్రకటించారు. దీంతో ఉద్యోగులకు వరుసగా మూడు రోజులు సెలవులు వస్తుండటంతో పిల్లలతో కలిసి విహార యాత్రలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం.. ఇన్నాళ్లు గడప గడప తిరిగి ప్రచారం చేసుకున్న అభ్యర్థులకు ఇప్పుడు కలవరం మొదలైంది. పోలింగ్ శాతం పడిపోతే తమకెక్కడ ఇబ్బంది అవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పోలింగ్ శాతం పెంచే విధంగా ప్రతి ఒక్కరితో ఓటు వేయించాలని అభ్యర్థులు వారి అనుచరులకు సూచనలు చేస్తున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం దూర ప్రాంతాల్లో ఉంటున్న వారిని కూడా రప్పించేందుకు ఆయా పార్టీల వారు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బీజేపీ

● టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్

సుభాష్‌నగర్, మే 11: దేశాన్ని ఏలుతున్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ పేర్కొన్నారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని, దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. జీఎస్టీ, పెట్రోలు ధరలు పెంపుతో రూ.58 లక్షల కోట్ల ఆర్థిక భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. ప్రజల మధ్య అసమానతలను పెంచిందన్నారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగిందన్నారు. దేశంలోని సైన్యాన్ని బలహీనపరిచిందన్నారు. 60 నుంచి 70 శాతం సైన్యాన్ని రిక్రూట్‌మెంట్ చేయాల్సి ఉండగా, చైనా తరహాలో సైన్యాన్ని ప్రైవేటీకరణ చేయాలని కేంద్రం చూస్తోందని కోదండరామ్ ఆరోపించారు. సైన్యాన్ని బలహీన పరిచిన వారు దేశాన్ని ఏం ఏలుతారని ప్రశ్నించారు. దేశ వనరులన్నీ కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడి, దేశ వనరులను ప్రజలకు అప్పగిస్తామంటున్న కాంగ్రెస్ పార్టీకి ఓటు చేయాని ఆయన కోరారు. కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. సమావేశంలో ముక్కెర రాజు, అంబటి నాగయ్య, నరహరి జగ్గారెడ్డి, నర్సయ్య, కనకం కుమారస్వామి, లక్ష్మీబాయి, సునీత, రమేశ్, కర్ర సతీష్, ఐల ప్రసన్న, అంబటి శ్రీనివాస్, ప్రొఫెసర్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

అదానీ, అంబానీల చేతుల్లోకి వ్యవసాయ రంగం

హుజూరాబాద్: వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని జరిగిన రైతుల ఉద్యమాలపై నిర్బంధాన్ని ప్రయోగించి వందలాది మంది రైతులకు చావుకు కారణమైన మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే వ్యవసాయ రంగం అదానీ, అంబానీల చేతుల్లోకి వెళ్తుందని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో 'ప్రమాదంలో భారత ప్రజాస్వామ్యం అనే సదస్సు' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కోదండరాం హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసమే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీని, మోదీని ఓడించాలన్నారు.

పకడ్బందీగా పోలింగ్ నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

జగిత్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పకడ్బందీగా పోలింగ్ నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శనివారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిజామాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుల సమక్షంలో పోలింగ్ పర్సనల్ మూడవ ర్యాండమైజేషన్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం పోలింగ్ నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకర, ఆర్డీవోలు మధు సుదన్, ఆనంద్ కుమార్, కలెక్టరేట్ ఏవో హను మంత రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు హకీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

జగిత్యాల టౌన్, మే 11 :పార్లమెంట్ ఎన్నికల నిర్వాహణకు అంతా సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా జి ల్లాకు విచ్చేసిన పోలీస్ అధికారులు సిబ్బందితో పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో ఎస్పీ ఆధ్వర్యంలో బ్రీఫింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల విధులకు వచ్చిన సెంట్రల్ ఆర్మడ్ ఫోర్స్ వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీస్ అధికారుల, సిబ్బందికి ఎన్నికల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాన్ని ఎట్టి పరి స్థితుల్లో వదిలి వెళ్లరాదన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వారితో మర్యాద పూర్వకంగా ఉండాలన్నారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే ఏ చిన్న సంఘటన ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఓటర్లు పోలింగ్ కేంద్రా నికి సెల్‌ఫోన్లు, ఇంక్ బాటిల్స్ తీసుకవెళ్లకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సెల్ఫీలు దిగడం నిషేధమన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీలు వినోద్ కుమార్, భీం రావు, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీలు రఘు చందర్, రవీంద్ర కుమార్, ఉమామహేశ్వర్ రావు, రంగారెడ్డి, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వర్ రావు, వేణు గోపాల్, ఆరీఫ్ అలీఖాన్, రవి, రామ్, నరసింహా రెడ్డి, సురేష్, నవీన్ ఆర్ఐలు వేణు, రామకృష్ణ, జానీమియా ఉన్నారు.

నిజానికి..అబద్ధానికి జరుగుతున్న పోరు ఇది

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, మే 11 : నిజామాబాదు పార్లమెంట్ పరిధిలో జరుగుతున్న ఎన్నికలు పదేళ్ల నిజానికి ఐదేళ్ల అబద్దానికి జరుగుతున్న పోరు అని... ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలో కాంగ్రెస్ పోటీలో కనపడడం లేదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. శనివారం పట్టణంలోని టీఆర్ఎస్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం మాట్లాడారు. బీఆర్ఎస్ బీజేపీ మధ్య ఎన్నికల ఒప్పదం ఉంటే కవితను ఎందుకు అరెస్టు చేస్తుందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడిన మాటలకు కౌంటర్ ఇచ్చాడు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమం మరిచిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, కౌన్సిలర్ సజ్జు నాయకులు బాబ, ప్రభు, రహీం, వేణు పాల్గొన్నారు.

ఢిల్లీలో కొట్లాట..గల్లీలో దోస్తీలా కాంగ్రెస్, బీజేపీలు

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో కొట్లాట.. గల్లీలో దోస్తీలా కాంగ్రెస్, బీజేపీలు రాజకీయం చేస్తున్నాయని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని మోతె రోడ్డులో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలు కుమ్మక్కు అయ్యాయని కాంగ్రెస్ అసత్య ప్రచారానికి పాల్పడుతుందని ఆరోపించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ మద్దతు పలకడం వల్లే బీజేపీ అభ్యర్థి అర్వింద్ విజయం సాధించాడన్న విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సతీష్, జడ్పీటీసీ సభ్యుడు మహేశ్ పాల్గొన్నారు.

ఆర్ కృష్ణయ్యపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెట్టి నరేంద్ర

మెట్‌పల్లి, మే, 11 : ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి వెళ్లిన ఆర్ కృష్ణయ్యపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెట్టి నరేంద్ర డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రచారం చేసుకునే స్వేచ్ఛను అనగతొక్కడానికి దాడి చేయడాన్ని ఖండించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం చేసే ఆర్ కృష్ణయ్యకు ప్రభుత్వం భద్ర త కల్పించాలన్నారు. కృష్ణయ్యపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి మళ్లీ ఇలాంటి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు పుప్పాల రవి, విశాల్, సల్మాన్‌ఖాన్, పాల్గొన్నారు.

ముగిసిన ప్రచారం..

- ప్రలోభాలకు తెర లేపుతున్న అభ్యర్థులు
- మహిళా, కుల సంఘాలపైనే దృష్టి
- సాయంత్రం నుంచి వైన్ షాపులు బంద్
- జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలు



జగిత్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): లోక్ సభ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. ఇన్నాళ్లు మోత మోగిన మైక్‌లు శనివారం సాయంత్రం మూగబోయాయి. గెలుపే ధ్యేయంగా పావులు కదుపుతున్న అభ్యర్థులు, ప్రధాన పార్టీలు చివరి రోజు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు పట్టణ ప్రాంతాలపై దృష్టి కేంద్రీకరించారు. ఇదిలా ఉంటే జిల్లాలోని వైన్ షాపులు మూత పడ్డాయి. దీనికి తోడు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో రాజకీయం పతాక స్థాయికి చేరింది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కోరుట్ల, జగిత్యాల సెగ్మెంట్‌లతో పాటు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కొడిమ్యాల, మల్యాల, మేడిపల్లి, కథలాపూర్, బీమారం మండలాలు, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిదిలోని ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్‌లలోని పలు గ్రామాల్లో కాలికి బలపం కట్టుకున్నట్లుగా ప్రధాన పార్టీల అభ్యర్థులు దాదాపు నెల రోజులుగా ప్రచారం చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్, బీఆర్ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్‌లు ప్రచారాన్ని హోరెత్తించారు. నిజామాబాద్ పార్లమెం ట్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య హోరాహోరీగా పోరు సాగుతుండగా, ఈ మూడు పార్టీలకు చెందిన ముగ్గురు అభ్యర్థులు పట్టణ ఓటర్లపైనే దృష్టి పెట్టారు.

హేమా హేమీలతో ప్రచారం...

జిల్లాలో ప్రధాన రాజకీయ పక్షాలకు చెందిన అభ్యర్థులు హేమా హేమీలతో ప్రచారం నిర్వహించారు. నిజామాబాద్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జగిత్యాలలో ప్రచార సభను నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా మాజీ సీఎం కేసీఆర్ జగిత్యాలలో రోడ్ షో, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డికి మద్దతుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జగిత్యాల, కోరుట్లలలో పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం వంశీకి మద్దతుగా ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం పరిదిలోని ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో ప్రచార సభలను నిర్వహించారు.

ప్రలోభాలకు తెర లేపిన అభ్యర్థులు

ఎన్నికలకు మరొక్క రోజే గడువు ఉండటంతో అభ్యర్థులు, ప్రధాన రాజకీయ పక్షాలు ఓట్లు రాబట్టే పనిలో నిమగ్నమయ్యారు. అన్ని అస్త్రాలు ప్రయోగిస్తూ వస్తున్న అభ్యర్థులు ఇప్పుడు ప్రలోభాలకు తెర లేపబోతున్నారు. పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టిన అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్లకు పెద్ద మొత్తంలో డబ్బులు అప్పగిస్తున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల ఏజెంట్లతో ప్రధాన పార్టీల అభ్యర్థులు మాట్లాడి డబ్బులు సమకూర్చుతున్నట్లు తెలిసింది. ప్రధానంగా మహిళా సంఘాలు, యువజన సంఘాలపై దృష్టి కేంద్రీకరించి, వారికి పెద్ద ఎత్తున నగదు పంపిణీ చేసే పనిలో ఉన్నట్లు ప్రచారం సాగుతుంది.

డేటాను ధ్వంసం చేసిన కేసీఆర్ దేశద్రోహి

ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్


కరీంనగర్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఫోన్ ట్యాపింగ్ కేసులో దొరికి పోతామనే భయంతో దేశ భద్రతా డేటాను ధ్వంసం చేసిన కేసీఆర్ దేశద్రోహి అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం నగరంలో పెద్ద ఎత్తున మహా బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కలిసి బైక్‌ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఇంటలిజెన్స్ వద్ద నున్న దేశ భద్రత డేటాను ధ్వంసం చేశారన్నారు. అలాంటి దేశద్రోహిని ఇంత వరకు ఎందుకు అరెస్ట చేయలేదని ప్రశ్నించారు. నరేంద్రమోదీ లేని భారతదేశాన్ని ఊహించుకోలేమన్నారు. మోదీ మళ్లీ ప్రధానిగా కాకుంటే భారతదేశాన్ని పాకిస్తాన్‌లా మార్చే ప్రమాదముందన్నారు. కొన్ని ఇస్లాం సంస్థలు భారత్‌ను ఇస్లామిక్ దేశంగా చేసే కుట్ర చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ యాభై ఏళ్ల పాలనలో ముస్లిం జనభా 43 శాతం పెరిగిందన్నారు. హిందువుల జనాబా ఎనిమిది శాతం తగ్గిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే ఇప్పటికే కేసీఆర్‌ను బొక్కలో వేసే వాళ్లమన్నారు. కేసీఆర్ ఫాంహౌస్‌లో పోయి సర్జికల్ స్ట్రయిక్ చేసి దేశద్రోహులను ఏరిపారేసే వాళ్లమన్నారు. కరీంనగర్‌లో పోటీ చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఏనాడైనా ప్రజలను కలిశారా.. అని ప్రశ్నించారు. ఎంపీగా గెలిపిస్తే ఆరు గ్యారెంటీల అమలు కోసం కొట్లాడతానన్నారు. హిందూ ఓటు బ్యాంకు ద్వారా పక్కా గెలుస్తున్నానని, ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, హిందుత్వం గురించి మాట్లాడనని, కాషాయ జెండా పట్టుకోనన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటై 12 శాతం ఓటు బ్యాంకుతో తనను ఓడించే కుట్ర చేస్తున్నారన్నారు. హిందువులంతా ఏకం కావాలని కోరారు. హిందు సమాజం ఏకం కాకపోతే ధర్మ రక్షకులు కరువవుతారన్నారు. అందరి ఆశీస్సులతో బంపర్ మెజారిటీతో గెలువబోతున్నామన్నారు.

సంక్షిప్త సమాచారం

కథలాపూర్ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం బీజేపీ శ్రేణులు ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, సత్యనా రాయణ, లక్ష్మీనారాయణ, మంగళి మహేశ్, మల్యాల మారుతి, ప్రతాప్ ఉన్నారు.

● ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం ముమ్మర ఏర్పాట్లు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో ప్రవీణ్ తెలిపారు.

● కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరుతూ శనివారం కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

● మండలంలోని ఇప్పపల్లి, కలికోట, రాజారాం తండా, అంబారిపేట గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింం హారావు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని ఓటర్లను కోరారు.

కొడిమ్యాల : కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కొడిమ్యాల జడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి కోరారు. శనివారం మధ్యాహ్నం మండలంలోని హిమ్మతురావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడ్పీటీసీ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని గ్రామాలు అభివృద్ధి చెందాలంటె వినోద్‌కుమార్ పార్లమెంట్‌లో ఉండాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, తిర్మాలాపూర్ సింగిల్ విండో చైర్మన్ రాజేందర్ పాల్గొన్నారు.

మల్లాపూర్ : లోక్‌సభ ఎన్నికల్లో పార్టీల అభ్యర్థులను భారీ గెలిపించికోవడం కోసం చేస్తున్న ప్రచారం ముగియడంతో మండలంలో ఆయా పార్టీల నాయకుల ప్రచారం జోరుగా కొనసాగింది. శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పలు గ్రామాల్లో పర్యటించి ప్రచారం చేపట్టారు.

వెల్గటూర్: పెద్దపల్లి ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం రాజక్కపల్లిలో మాజీ ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

ఎండపల్లి: పెద్దపెల్లి పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణని గెలిపిస్తేనే పేద ప్రజలను న్యాయం జరుగు తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం పలు గ్రామాలలో కార్మికులకు మజ్జిగ ప్యాకెట్టు పంపిణీ చేశారు.

వెల్గటూర్: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీని హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి కోరారు.

ఐదేళ్లలో బండి సంజయ్‌ని ఎక్కడైనా చూశారా?

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్


హుజూరాబాద్ రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేటీఆర్

హుజూరాబాద్, మే 11: ఐదేళ్లలో బండి సంజయ్‌ని ఎప్పుడైనా.... ఎక్కడైనా చూశారా అని, అమిత్ షా చెప్పులు మోసుడే తప్ప బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ పరిధి అభివృద్ధికి పీకిందేం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శించారు.. శనివారం హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండి సంజయ్ గాలి తిరుగుడు తిరుగుతూ, హిందూ ముస్లింల పంచాయతీ తప్ప ఏం చేసిండన్నారు. పదేళ్ల పనిచేసిన ప్రధాని మోదీ నిజానికి చేసిన మంచి పనులు ఏంటో చెప్పాలన్నారు. పదేళ్ల ఏం చేసినయ్యా అంటే చెప్పడానికి వాళ్లకు ఏమీ లేదని, అందుకే గుడి కట్టిమని అంటున్నారన్నారు. గత ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలు అముల చేశాడా అని ప్రశ్నించారు. 12 సీట్లు ఇస్తే, ఆరు నెలల్లో మళ్లీ కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలు శాసిస్తారన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గానికి దుమ్మున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఉన్నాడని, పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను కూడా గెలిపిస్తే జోడెడ్లలాగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ఎన్నికల్లో బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించా లన్నారు.

● మతతత్వ బీజేపీని ఓడించండి

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

లోక్‌సభ ఎన్నికల్లో మతతత్వ పార్టీ అయిన బీజేపీని ఓడించాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయనపల్లి వినోద్‌కుమార్ కోరారు. మాజీ మంత్రి కేటీఆర్ రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో స్మార్ట్ సిటీ, రైల్వే లైన్లు, రైల్వే బ్రిడ్జీలు, తీసుకొచ్చింది తానేనన్నారు. కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఐదేళ్లలో నయా పైసా తీసుకురాలేదన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మోడల్‌స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలు

మల్యాల, మే 11: నూకపల్లి మోడల్‌స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ డి.సరితాదేవి కోరారు. 2024-25 సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులలో ప్రతి గ్రూప్‌లోనూ 40సీట్లు అందుబాటు లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 25 వరకు ఎలాంటి ఫీజు లేకుండా ఉచితంగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 26న ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల చేస్తామని తెలిపారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం

మల్యాల, మే 11: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు బండి సంజయ్, వెలిచాల రాజేంధర్‌రావు, బి.వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఆయా పార్టీల నాయకు లు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటా తిరుగుతూ తమ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. బీజేపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని మల్యాలలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావు మద్దతుగా అన్నీ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు.

సమస్యలపై అవగాహన లేనివారు అవసరమా?

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు


కరీంనగర్‌లో మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, మే 11: స్మార్ట్‌సిటీ పనుల్లో అవినీతికి పాల్పడి 30 శాతం కమిషన్ పంచుకున్న అవినీతిపరులు, కరీంనగర్ ప్రజల సమస్యలపై కనీస అవగాహనలేని దద్దమ్మలు మనకి అవసరమా? అని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ప్రశ్నించారు. కరీంనగర్ గీతాభవన్ చౌరస్తా వద్ద శక్తి యాత్ర పేరుతో ప్రచారం చివరి రోజైన శనివారం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా ఎంపీలుగా ఉన్న బోయినపల్లి వినోద్ కుమార్, బండి సంజయ్ నయా పైసా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. బండి సంజయ్‌కి మరోసారి అవకాశం కల్పిస్తే కరీంనగర్‌ను అభివృద్ధి చేయడని.. అతనే ఆర్థికంగా అభివృద్ధి చెందుతాడన్నారు. 2014లో నామినేషన్ పత్రాలు కోసం దుకు భార్య పుస్తల తాడు అమ్మిన బండి సంజయ్ ఇప్పుడు వేల కోట్లకు అధిపతి ఎలా అయ్యాడని నిలదీశారు. ఎన్నికల సమయంలో వందల కోట్లు ఎలా ఖర్చు పెడుతున్నాడని ప్రశ్నించారు. బండి సంజయ్ ఒక చవట అని, పదో తరగతిఫెయిల్ అయ్యాడని అందరూ అనుకుం టున్నారని, ఇరిగేషన్ శాఖలో ఎవరు పని చేస్తారో, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఎవరు పని చేస్తారో తెలియని దద్దమ్మ అని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అంబేద్కర్ విగ్రహాలు తొలగించి, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేస్తాం అంటున్న బీజేపీని బండకేసి కొట్టాలని రాజేందర్‌రావు పిలుపునిచ్చారు. ఇప్పటికే జిల్లా మంత్రిగా పొన్నం ప్రభాకర్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఆయనకు తోడుగా తనను పార్లమెం టుకు పంపిస్తే జోడెడ్లలా పనిచేసి కరీం నగర్‌ను కోహినూరుగా తీర్చిదిద్దుతామని రాజేందర్‌రావు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రితోపాటు రాజేందర్‌రావు, ఇతర నాయకులు గీతా భవన్ చౌరస్తా నుంచి బస్ స్టేషన్ వరకు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయండి

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మే 11: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఓటు వేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ధర్మపురిలోని శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ దుకాణదారులు, చిరు వ్యాపారులు, క్రయ, విక్రయ దారులను కలిసి వంశీకృష్ణకు మద్దతు ఇవ్వాలన్నారు. బీజేపీ మతం పేరట, దేవుడి పేరట ఓట్లు అడగటం కాద ని, ప్రజలకు చేసిన పని ఏమిటో చెప్పుకుని ఓట్లు అడగాలని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అన్ని రంగాల్లో దగా పడ్డారని ఆయన తెలిపారు. గడ్డం వంశీకృష్ణ చేతి గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి, సంగనభట్ల సంతోషి, గరిగె అరుణ, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ప్రసాద్ పాల్గొన్నారు.

గొల్లపల్లి: ప్రజా కుటుంబం నుంచి ఎన్నికల బరిలో నిలిచిన గడ్డం వంశీకృష్ణ కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి పెద్దపల్లి ఎంపీగా ఆశీ ర్వదించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం గొల్లపల్లి మండల కేంద్రంతో పాటు మండ లంలోని చెందోళి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణకు మద్దతుగా స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీరాముల పల్లె మాజీ సర్పంచ్ శనిగారపు మల్లేశం సుమారు వంద మంది అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. బీబీరాజ్ పల్లె తాజా మాజీ ఉప సర్పంచ్ రాజేందర్ నాయక్‌తో పలువురు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బుగ్గారం : బీజేపీ వాళ్లు దేవుడి పేరు చెప్పుకుని ఓట్లు అడుగుతున్నారని విప్ ఎమ్మేల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

ఈ మేరకు బుగ్గారం మండల కేంద్రంలో శనివారం ఆత్మీయ మహిళ సమ్మేళనం సభలో అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారింటి పథకాల అమలులో నాలుగు అమలు చేసుకున్నాం అని మిగిత గ్యారింటిలు ఎన్నికల కోడ్ ముగిసిన వేంటనే అమలు చేస్తాం అని అన్నారు.


ధర్మపురిలో ప్రచారం చేస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల టౌన్, మే 11 : ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ కోరారు. జిల్లా కేంద్రంలో 300 మంది పోలీస్ జిల్లా, కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించగా ఎస్పీ జెండా ఊపి ప్రాంభించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ బూ తుల్లో పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కుపై అవగాహన

ధర్మపురి, మే 11: ధర్మపురి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ఓటు హక్కుపై శనివారం అవగాహన కల్పించారు. జగిత్యాల డీపీఆర్వో భీమ్‌కుమార్ ఆధ్వర్యంలో కళాకారులు ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, తగు జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. బీఎల్‌వోలు గంగజమున, రాజేశ్వరీ, కళాకారులు పలిగిరి రాజేందర్, మహిపాల్, మల్లికతేజ, ప్రవీణ్ పాల్గొన్నారు.

జీవన్ రెడ్డిని గెలిపించాలి

కోరుట్ల, మే 11 : కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని బారీ మోజార్టీతో గె లిపించాలని కొరుతూ శనివారం సీపీఐ నాయకులు విస్తృతంగా ప్రచా రం నిర్వహించారు. పట్టణంలోని పాత మార్కెట్‌తో పాటు కాల్వగడ్డ, వెంకటేశ్వర స్వామి దేవాలయ పరిసర ప్రాంతాలలో ప్రచారం నిర్వ హించి చేతి గుర్తుకు ఓటు వేయ్యాలని కోరారు.

'బాజిరెడ్డికి భారీ మెజార్టీ అందించాలి'

కోరుట్ల రూరల్, మే 11 : నిజామాబాదు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు బారీ మోజార్టీని అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కొరారు. శనివారం మండలంలోని అయా గ్రామాలలో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటు వేసి బారీ మోజార్టీతో గెలిపించాలిని కొరారు.